# మానవత

**-వాలి హిరణ్మయీదేవి**

గేటు చప్పుడయితే విండోలోంచి తొంగి చూసింది నందిని. పక్కింటి రామారావు స్కూటర్ నడిపించుకుంటూ రావడం చూసి నిట్టూర్చి కిటికీ రెక్కలు మూసేసిందామె. మిన్ను విరిగి మీద పడ్డా ఏడింటిలోపునే ఇల్లు చేరతాడతడు. లేకుంటే అతని భార్య అంజలి నానాయాగీ చేసేస్తుంది మరి. చదువూ సంధ్యా లేకున్నా ఇంటిపట్టునే ఉంటున్నా అతని జీవితమంతా లాక్కుని భర్తని తన చెప్పుచేతల్లో ఉంచుకున్న అంజలిని చూస్తే నందినికెప్పుడూ ఆశ్చర్యమే. అందుకు రామారావు చింతించినట్లూ కనబడడు. పైగా 'మా ఆవిడ కాబట్టి ఇల్లు ఇంత చక్కగా నడిపిస్తుంది. నిజమైన హోంమేకర్, ఆవిడ లెక్కగా ఇచ్చే పాకెట్‌మనీ వల్లనే నేను వ్యసనాలకు దూరంగా ఉండగలుగుతున్నాను" అంటూ గొప్పగా చెప్పుకుంటాడు కూడా.

మరో మూడుగంటలు గడిచినా జయంత్ రానేలేదు.

నిద్ర మధ్యలో లేచిన ప్రణీత్ "ఏంటమ్మా నాన్నగారింకా రానేలేదా'' అని అడిగేసరికి ఉలిక్కిపడింది.

"నాన్న రోజూ ఆలస్యంగానే వస్తున్నారు. పొద్దుటే వెళ్లిపోతున్నారు. కనీసం ఆదివారమైనా మమ్మల్ని ఎక్కడికీ తీసుకువెళ్లడంలేదు. అసలు నాన్నే మాకు కనిపించడంలేదీ మధ్య'' అన్నాడు వాడు మళ్లీ దిగులుగా.

"నాన్నగారికి ఆఫీస్‌లో ఏవో అర్జంట్ పనులున్నాయిరా. కొత్తగా స్వంతం పెట్టుకున్న ఆఫీస్ కదా. అందుకే ఆలస్యంగా వస్తున్నారు. ఆ పనులన్నీ అయిపోయాక మనమందరం కలసి సరదాగా ఎక్కడికైనా వెడదాంలే'' అంది నందిని, ప్రణీత తల నిమురుతూ.

ఐదు నిముషాల్లో మళ్లీ నిద్రలోకి జారుకున్న కొడుకును సరిగ్గా పట్టుకోబెట్టి దుప్పటి కప్పింది.

పిల్లలిద్దరికి తండ్రి జయంత్ దగ్గరే చేరిక. పిల్లల్ని వదిలి ఉండలేనంటూనే తనని ఎక్కడికీ పంపడు.

అది బాధ కలిగించినా అందుకు అలవాటుపడింది. ఫలితంగా బంధువులూ, స్నేహితులూ ఉండి ఒంటరిదయింది.

ఎప్పుడూ మేము రావడమే తప్ప నువ్వొచ్చేది లేదంటూ వాళ్లూ తమ రాకపోకలు తగ్గించారు. అది తనకు మనస్తాపం కలిగిస్తే, జయంత్‌కి మాత్రం చాలా హాయిగా ఉన్నట్లే కన్పిస్తోంది.

మరో అరగంట భారంగా గడిచాక వచ్చాడు జయంత్.

వస్తూనే "సారీ నందూ! అనుకోకుండా లేట్ అయింది. బాగా అలసిపోయాను. బైట పార్టీలో తినేసాను. అన్నట్లు నువ్వు భోజనం చేసావా'' అడిగాడు కాజువల్‌గా.

ఆ అడగడంలో ఏమాత్రం ఆప్యాయత లేకపోవడం చూసి "మనమంతా కలసి తినేది రాత్రిళ్లు మాత్రమే. అదీ కరువయిపోతోందీ మధ్య'' అంది నందిని నిష్ఠూరంగా.

"సారీ అన్నాగా. అన్నట్లు మనం వైజాగ్‌లో కొంటున్న ఫ్లాట్ డాక్యుమెంట్స్ అన్నీ రెడీ చేసావా?'' అన్నాడు.

"ఊ'' అంది నందిని ముభావంగా.

"మొహం అలా పెట్టకు. మన పిల్లల భవిష్యత్తు కోసమేగా నేనేది చేసినా'' అన్నాడు జయంత్ నిద్రకు ఉపక్రమిస్తూ.

'ఫ్లాట్ సంగతి గుర్తుందిగానీ కొడుకు పుట్టిన రోజు మాత్రం గుర్తుకులేదు. గిఫ్టేదీ లేకుండా వట్టి చేతులతో వచ్చాడు' అని మనసులో అనుకుంది. అసలే చేతికి అంతంతమాత్రం జీతం వస్తోంది. జయంత్ అలా కమిట్‌మెంట్స్ పెట్టేస్తాడు. అన్నీ చేసాక చెప్పడం... పైగా అవన్నీ తమ మంచికేనని, ఫ్యూచర్ బాగుండాలని చేస్తున్నానని తనని నమ్మించడం.

ఇక ఏం చేస్తుంది తను. తనకి బాధపడడం అలవాటయిపోయింది. కానీ పాపం పిల్లలకు ఇంకా అలవాటు కావడంలేదు. వాడన్నిసార్లు తండ్రిని అడిగింది తను కోరుకున్న మెకానికల్ సెట్ కోసమేనని తనకు తెలుసు. కానీ తన చేతిలో డబ్బు లేక, అంత దూరం వెళ్లలేక ఎలాగూ జయంత్ కొని తెస్తాడన్న నమ్మకంతో కొనలేదు... పొద్దుటే ప్రణీత్ అడిగితే ఏం చెప్పాలి అనుకుంటూ.

"వాడికి గిఫ్ట్ పట్టుకురాలేదేమిటి?'' అంది అతడిని కుదుపుతూ.


"షిట్'' నుదుటిమీద కొట్టుకుంటూ "ప్చ్... ఈరోజు బేగంబజారు నుండి రాలేదు. అందుకే మరచిపోయాను. నువ్వయినా కొని ఉండాల్సింది. సర్లే రేపు ఈవెనింగ్‌కల్లా కొంటాలే'' అంటూ ముసుగుతన్నాడు.

తను తినలేదని చెప్పినా అతడు పట్టించుకోకపోవడం, కొడుకు గిఫ్ట్‌ని మరచిపోవడం, బాధనీ, విస్మయాన్నీ కలిగించాయి.

'జయంత్‌లో ఏమిటో చాలా మార్పు వస్తోంది. ఇదంతా పని వత్తిడేనా? లేక...?' అంటూ ఆపై ఆలోచించలేక ఆ టైమ్‌లో తినబుద్ధికాక వెళ్లి మంచినీళ్లు తాగి మంచం మీదకు


ఒరిగింది నందిని. ఎందుకో మనసంతా ఏదోలా ఉండి ఏడవాలనిపించింది ఆమెకు. జయంత్ పెట్టే గురకలో నిద్రాదేవి నందినిని కరుణించలేదు ఎప్పట్లాగా. రాత్రంతా నిద్రకు దూరమైంది. పొద్దుటే పిల్లల స్కూల్ గురించి లేవవలసి రావడంతో ఆమె కళ్లకింద నల్లటి వలయాల ఏర్పడుతున్నాయి ఆ నిద్రలేమివల్ల.

★★★



మర్నాడు "అమ్మా... నాన్నేంటమ్మా ఏడవుతున్నా ఇంకా ఇంటికి రాలేదు. పొద్దుట ఐదింటికల్లా వస్తానన్నారుకదా. మా ఫ్రెండ్స్ అంతా వెళ్లిపోతామంటున్నారు. ఇప్పుడు ఏం చేయను" చిన్నబోయిన మొహంతో అడుగుతున్న ప్రణీత్‌ని చూస్తే మనసంతా చెప్పలేని బాధతో నిండిపోయింది నందినికి.

కేక్ వంక ఆశగా చూస్తున్న పిల్లలందరి మొహాలు చూసి "ముందు నువ్వు కేక్ కట్ చేసేయ్. నాన్న వస్తే మరోటి కొనచ్చులే" అంది.



## ఆడవారి మాటలకు...

సినిమా తారలు కూడా తమకిష్టం లేనప్పుడు- పారితోషికం మరీ భారీగా చెప్పో, కథ నచ్చలేదనో, ఇంకేదో కారణం చెప్పి తప్పించుకుంటారు. తాజాగా దీపికా పదుకొనె కూడా తెలుగులో నటించడానికి ఆఫర్ వస్తే ఆ చిత్ర కథ నచ్చలేదని, మారిస్తే ఆలోచిస్తానని సెలవిచ్చిందిట. ఆ చిత్రంలో హీరో మహేష్ బాబు, దర్శకుడు శ్రీను వైట్ల. ఇలాంటి కాంబినేషన్‌లో హీరోయిన్‌గా నటించడానికి కథ నచ్చాలన్నదీ అంటే ఇక వేరే ఉద్దేశం ఏం వుంటుంది చెప్పండి.




జయంత్ లేడన్న లోటు తప్పించి బర్త్‌డే బాగానే జరిగింది.

***

"నందినీ! మీకు బెంగుళూరులో ఎవరైనా బంధువులు ఉన్నారా?" అడిగింది పక్కింటి అంజలి.

"ఊహూ...లేరు. దేనికి?" అడిగింది నందిని.

ఆమె కాస్త క్లోజ్‌గా మాట్లాడేది ఒక్క అంజలితోనే. ఇద్దరివీ స్వంతిళ్లే అవడంవల్ల పదేళ్లుగా పరిచయం.

"మరి మీవారు అక్కడ ఒకావిడతో కాస్త క్లోజ్‌గా కన్పించారే" అంది. ఇంకా ఏదో చెప్పాలని ఉన్నా...దిగులుగా వున్న నందిని మొహం చూసి చెప్పలేక ఆపింది.

"ఆఫీస్ పనిమీద వెళ్లారు మరి. బహుశా పాత ఫ్రెండో, కొలీగో అయి ఉండవచ్చునేమో" అంది నందిని.

"కానీ... ఎందుకో ఆమె అలా అన్పించలేదు నాకు నందినీ" అంది అంజలి.

ఆమె వెళ్లిపోయినా నందినికి అంజలి మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. పెళ్లయిన ఏడేళ్లకు మగాళ్లకు ఏదో సార్ట్ అవుతుందని ఓ రచయిత రాసాడు. అది తమ పెళ్లయిన పదిహేనేళ్లకు జయంత్‌కి మొదలయిందా? ఎందుకో ఆ భావన చేదుగా తోచింది నందినికి. 'ఛ...విశాల హృదయం లేని, చదువుసంధ్యలేని అంజలి ఏదో చెబితే అది నమ్మి బాధపడడం ఏంటి?' అనుకుంటూ ఇల్లు సర్దేందుకు ఉపక్రమించింది నందిని. ఖాళీగా ఉంటే బుర్ర దెయ్యాల గుహగా మారుతుంది అనుకుందిగానీ మనసు గడిచిన రోజుల్లోకి తొంగి చూస్తోంటే ఆపలేకపోయింది.

"నందూ! వనస్థలిపురంలో రెండువందల గజాల స్థలం ఉంటే తీసుకున్నానోయ్. బ్యాంక్ నుండి లోన్ తీసుకున్నా నువ్వూ పర్సనల్ లోన్ తియ్యాలి. ఇదిగో ఆ పేపర్స్ అన్నీ రెడీ చేస్తా. సైన్ చేయి" అంటూ పేపర్లు అందించాడు.

"ఇప్పటికే జీతం బొటాబొటిగా చేతికందుకుంటే మళ్లీ ఇదొకటా?" అంది.

"పిచ్చీ! కమిట్‌మెంట్స్ ఉంటేనే పొదుపుగా ఉండగలం. ప్రణీత్ పెద్దయ్యే సరికి అదెంత అవుతుందో నువ్వు ఊహించలేవు" అన్నాడు ఎప్పట్లాగే రంగుల ప్రపంచాన్నంతా ఆమె ముందు వుంచుతూ.

దాంతో ఎప్పట్లాగే తలాడించింది ఆమె.

"ఏమిటి నందూ! ఇద్దరు బాబులున్నారుగా. ఇప్పుడు మూడోది అవసరమా?"

తనెంతో సంబరంగా చెప్పిన విషయానికి అతడు స్పందించిన తీరు అది.

"అవసరమే. నాకు పాప కావాలని ఎంత ఆశో మీకు తెలుసు" అంది.

"వద్దు నందూ. ఇద్దరు చాలు. నువ్వన్నట్లు పాపే అయితే చాలా కష్టం. భరించలేని ఖర్చులు, నీ హెల్త్ అంతంత మాత్రం. ఇద్దరితోనే చేసుకోలేకపోతున్నావు. నాకు నీ ఆరోగ్యం ముఖ్యం నందూ" అన్నాడు లాలనగా.

అంతే ఎప్పట్లా కరిగిపోయి భ్రూణహత్యకు కూడా పాల్పడింది.

***

"నందూ! ఎన్నాళ్లు జాబ్ చేసినా ఏమంత ఎదుగుదల ఉండడంలేదు. మా ఫ్రెండ్స్ అంతా కలసి ఏదైనా వ్యాపారం చేయాలని ప్లాన్ చేసాం. మీ నాన్నగారు బ్యాంక్‌లో డిపాజిట్ చేసినదానిమీద ఏమంత ఇంట్రెస్టు వస్తోం

దని? అది తీసి మన పెట్టుబడిగా పెడదాం. ఐదేళ్లకే అది డబుల్ ఏంటి త్రిబుల్ అవుతుంది'' అన్నాడు జయంత్.

"అది స్త్రీ ధనంగా ఇచ్చింది. దాన్ని కదపడం ఎందుకు?'' అంది అయిష్టంగా.

"పిచ్చి నందూ! దాన్ని మూడింతలు చేసిస్తానంటే నమ్మవేంటి? నా మీద నమ్మకంలేదా? నేనేం చేసినా మన మంచికోసమేకదా'' అంటూ పిల్లల్నో చేత్తో, తననో చేత్తో హత్తుకుంటూ చెప్పేసరికి ఆ డబ్బు డ్రా చేసి అతడి చేతుల్లో పెట్టింది.

అది మొదలు ఏదో ఆఫీస్ తెరిచి రియల్ ఎస్టేట్ బిజినెస్ పెట్టారు. పనులంటూ ఆలస్యంగా రావడం మొదలుపెట్టారు. వాళ్లనీ వీళ్లనీ కలవాలంటూ ఊళ్లు తిరగడం మొదలెట్టారు. ఇంటిపట్టున ఉండడం తగ్గిస్తూ వచ్చాడు.

డోర్ బెల్ చప్పుడవడంతో ఈలోకంలోకి వచ్చింది నందిని.

నోటికి చేతులడ్డం పెట్టుకుని వచ్చాడు జయంత్. డ్రింక్ చేసి వచ్చినట్లు చూడగానే తెలిసిపోతోంది.

ముందు ఏ రెండేళ్లకో మూడేళ్లకో మరీ తప్పనిసరి పరిస్థితుల్లో కొంచెం తాగే జయంత్ ఈమధ్య తరచూ తాగి వస్తున్నాడు. ఏమన్నా అంటే బిజినెస్‌లో నలుగురిని నాలుగు పనుల దృష్ట్యా కలవాల్సి వస్తుంది. వాళ్ల వాళ్ల అలవాట్లని బట్టి ఇలాంటివి తప్పవు నందూ. అర్థం చేసుకోవాలి మరి'' అనడం మొదలుపెట్టాడు.

జీవితం ఏమిటో గాడి తప్పుతోంది అన్పించేది నందినికి. ఇప్పుడూ అదే అన్పించింది. జయంత్ వంక తిరస్కారంగా చూసి బెడ్రూంలోకి వెళ్లిపోయింది.

ఆమెకు కోపం వచ్చిందని గ్రహించిన జయంత్ మెల్లగా వెళ్లి బుజ్జగిస్తూ ఓ కొత్త కథ విన్పించి మెల్లమెల్లగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. అతని కోరికలోని తీవ్రతకు లొంగిపోక తప్పలేదు ఆమెకు.

అతడటు తిరిగి పడుకోగానే నిస్సహాయతతో నందిని చెంపలమీదుగా జలజలా కన్నీళ్లు. ముందు తనని ముద్దుమురిపాలతో అలరించిగానీ తనలో శృంగార ఉద్దీపనలు చేసిగానీ దగ్గరకు చేరేవాడుకాదు. ఇప్పుడో అంతా యాంత్రికం. అతను తనని మనసారా దగ్గరకు తీసుకుని ఎన్నాళ్లయింది? ఆలోచనలో పడింది నందిని.

"సారీ నవ్యా! ప్లీజ్ నన్ను వెళ్లనియ్. ఐ లవ్ యూ డార్లింగ్. ప్లీజ్ ఇవ్వాల్టికి ఇంటికి వెళ్లనీ'' అంటూ ముద్దముద్దగా వినిపిస్తున్న జయంత్ కలవరింతలు చెళ్లున తగిలాయి.

తేనెతుట్టి కదిలినట్లు ఎన్నో అనుమానాలు, ఆలోచనలు చుట్టుముట్టాయి ఆమెను.

***

"నందూ! కాఫీ'' అరిచాడు జయంత్.

బదులుగా కాఫీగానీ నందినిగానీ లేక కిచెన్‌లోకి తొంగి చూస్తూ "నందూ! నిన్నే కాఫీ ఇవ్వు'' అన్నాడు.

ఎర్రగా అతనివంక చూసింది నందిని. తడబడ్డాడామె చూపులకు. 'ఏంటా చూపులకు అర్థం?' అనుకుంటూ "కాఫీ ఇవ్వవా డార్లింగ్'' అడిగాడు మెల్లగా.

"నవ్య ఎవరు?'' సూటిగా అడిగింది నందిని.

"నవ్యా? నవ్య ఎవరు? ఎవరి గురించి అడుగుతున్నావు?'' కాస్త గాబరాగా అడిగాడు.

"రాత్రంతా కలవరించారుగా... ఆ నవ్య ఎవరని?'' తీవ్రంగా అడిగింది నందిని.


ఆ గొంతులోని పదునుకి బెదిరినా అహంకారం పడగవిప్పడంతో "నవ్య నా క్లాస్‌మేట్. కాలేజీ రోజుల్లోనే మేం ప్రేమించుకున్నాం. రీసెంట్‌గా కలిసింది. పాపం ఇన్నేళ్లుగా నా కోసమే ఎదురుచూస్తూ పెళ్లి చేసుకోలేదు. తననలా చూస్తే బాధ కలిగింది. తను ఒంటరిగా ఉండిపోతే, నేను మాత్రం పెళ్లి చేసుకుని హాయిగా ఉన్నానన్న భావంతో చాలా గిల్టీగా ఫీలయ్యాను. ఆమె ఒంటరితనం పోగొట్టడానికి కలసి ఉండక తప్పడంలేదు. ప్లీజ్ నన్నర్థం



## పేదవాడి కారు

కోల్‌కత్తా శివార్లలోని బడ్జ్‌బడ్జ్‌లో వుంటున్న నురుద్దీన్ ఒక పూర్ మేన్స్ కారును డిజైన్ చేసి స్వయంగా తయారుచేసాడు. ప్రపంచంలో అతి చవకైన ఈ కారుని రెండువేల డాలర్ల లోపల చవగ్గా తయారుచేయవచ్చునుట. తను కలలుగన్న కారు ఫ్యాక్టరీని ఏదో ఒక రోజున ఆరంభించాలనుకుంటున్న నురుద్దీన్ ఇంజనీరింగ్ చదువుకోలేదు. కేవలం పుస్తకాలు చదివి వర్క్ షాపుల దగ్గర పని నేర్చుకున్న పరిజ్ఞానంతో ఆ కారును తయారు చేసాడు.

-తటవర్తి




సుకో నందూ'' ఆమె రెండు చేతులు పట్టుకుంటూ అన్నాడు జయంత్.

నిర్ఘాంతపోయింది నందిని.

'ఏంటి...తను వింటోంది నిజమేనా? జయంత్ నోటి నుండి అవే మాటలు వస్తున్నాయా? తనేమైనా పొరపాటుగా వింటోందా? ఆమెకి అపనమ్మకంగా ఉన్నా అతడి మొహంలో ఆమె కోసం పడుతున్న బాధ ఆమెని అంతా నిజమని నమ్మమని చెబుతోంది.


"ఐతే?'' అంది తడబడుతూ.



## లేండ్ మైన్ డిటెక్టర్

జపాన్‌లోని చైబా యూనివర్శిటీ శాస్త్రజ్ఞులు కామెట్-3 అనే లేండ్ మైన్ డిటెక్టర్ని రూపొందించారు. ఎక్కడైనా లేండ్ మైన్స్‌ని పాతి పెట్టారన్న అనుమానం ఉంటే ఆ డిటెక్టర్‌ని అక్కడికి తీసుకువెళితే దానిలోని రాడార్ గుర్తించి లేండ్‌మైన్స్ ఉన్న చోటు నేలమీద పెయింట్‌ను స్ప్రే చేస్తుందిట

-తటవర్తి




"నందూ! కాస్త పెద్ద మనసు చేసుకో. ఎవరికీ ఏ ప్రాబ్లం ఉండదు'' ఆమె కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

"అంటే?''

"నవ్య తనని పెళ్లి చేసుకోమని అడగడంలేదు. జస్ట్ తనతో కలసి ఉండమని అంటోంది అంతే''

'జస్ట్ కలసి ఉండడం' ఆ మాటలు హృదయాన్ని కత్తిలా కోస్తుంటే అతని వంక అసహ్యంగా చూసింది.

"నందూ! అలా చూడకు. నీకూ, పిల్లలకు ఎలాంటి లోటు చేయను. ఆమెకు నేనేం ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదు. తను జాబ్ హోల్డర్. కేవలం తోడుగా మాత్రమే నన్ను కోరుకుంటోంది అంతే''

ఆడవాళ్లు ఏడ్చేది డబ్బు కోసం మాత్రమేనన్నట్లు అతడలా అంటుంటే విస్తుపోయింది.

ఆమెను కన్విన్స్ చేయాలన్నట్లు "నిజం నందూ! మాకు పిల్లలు పుట్టే సమస్యలేదు ఆమెకున్న ప్రాబ్లంవలన. నందూ ఆమెపరంగా ఆలోచించు. తోడులేక, పిల్లల్లేక ఒంటరిగా గడపలేక అల్లాడిపోతున్న ఆమెకు నా తోడు ఎంతో అవసరం. అందుకే లోకాన్ని లెక్క చేయదల్చుకోలేదు. నీ సహకారం ఉంటే చాలు''

తను డిసైడ్ అయిపోయి ఇప్పుడూ పర్మిషన్ ఎందుకు? తనకు తెల్సిపోయింది కాబట్టి ఇదైనా... లేకుంటే తన కళ్లుగప్పి ఇంకెంతకాలం నాటకమాడేవాడో? అందుకే ఆ మహాకవి అన్నాడు 'వెనుక దగా, ముందు దగా, కుడి ఎడమల దగా' అని.

ఈ మనిషినా తనింత గుడ్డిగా నమ్మింది. దాంపత్యానికి నమ్మకం పునాది. ఆ పునాదికిలా బీటలు పడిపోతుంటే తనేం మాట్లాడాలి?

ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకుని "నాకు తెలుసు. చదువుకున్న దానివి కాబట్టి విశాల హృదయంతో మమ్మల్ని అర్థం చేసుకుంటావని. మన పిల్లల కోసమైనా పిచ్చి ఆలోచనలు చేయవని'' ధీమాగా అన్నాడతను.

"సహకారం అంటే నువ్వేం చేసినా చూస్తూ ఊరుకోవడమా?'' ఒళ్లు మండిన ఆవేశంతో ఏకవచన ప్రయోగం చేస్తూ అంది నందిని.

ఉలిక్కిపడ్డాడు జయంత్ అలాంటి స్వరం ఎప్పుడూ అతనికి అనుభవంలో లేక.

"నందూ! ఈనాటి సొసైటీలో ఇలాంటివి మామూలే. నువ్వు కొంచెం కోపరేట్ చేయాలి అంతే''

"సారీ నాకిష్టంలేదు'' ఖచ్చితంగా అంది నందిని తన స్త్రీత్వాన్ని అవమానించిన అతడి మొహం కూడా చూడాలన్పించక.

"ప్లీజ్ నందూ! ఎప్పుడూ నువ్వు నా మాటేదీ కాదనలేదు. ఇప్పుడిలా మొండి చేయడం మంచిదికాదు''

"అంటే తప్పు నాదేనా? మన పిల్లల భవిష్యత్తుబాగుండాలన్నట్లు నువ్వేది చెబితే అది విన్నాను నాకిష్టమున్నా లేకున్నా. ఇప్పుడు ఇదీ పిల్లల కోసమేనా?'' కోపంగా అంది.

"ఆహా ఖచ్చితంగా. అందుకే మనం విడాకులు తీసుకుంటే పిల్లలు నాకే చెందుతారు. వాళ్లు నీక్కావాలనుకుంటే నేను చెప్పినట్లు విను'' పురుషాహంకారం బుసలు కొడుతుండగా అన్నాడతను. ఆ తరువాత ఆమెను ఆలోచించుకోమని వదిలేసి వెళ్లిపోయాడు జయంత్.

గుండెల్లో గునపం దిగినట్లుగా అల్లాడిపోయింది నందిని. ఇంతేనా జీవితం?

ఇదేనా సహచర్యానికి దొరికిన ప్రతిఫలం? తనేం లోటు చేసింది? తనకంటూ వేరే లైఫ్ లేకుండా ప్రతి నిముషం, నా ఇల్లు, నా మొగుడు అనుకుంటూ బ్రతికిందే?

ఆస్తిపాస్తులన్నీ అమర్చినట్టే అమరుస్తూ ప్రతిదాంట్లో తన పేరు చేర్చుకుని ఆ అప్పులు తీర్చడానికి తనను కమిట్ చేయించి తన చేతులకు సంకెళ్లు వేసి ఇప్పుడు తన దారిన తాను పోతానంటున్నాడే? తను ప్రాణాలొడ్డి మరీ కన్నపిల్లలను దూరం చేస్తానంటున్నాడే? ఎంత దగా, ఎంత మోసం? తనెవరితో చెప్పుకుంటుందీ బాధ? తల్లిదండ్రులుగానీ, తోబుట్టువులుగానీ, ఫ్రెండ్స్‌గానీ ఎవరూ లేరే? జ్వరం వచ్చినదానిలా అయిపోయింది. ఆఫీస్‌కు లీవ్‌లెటర్ పంపించింది.

***

అంజలితో మాత్రం విషయం చెప్పింది ఆమె ఆరాలు తీసి, అండగా నిలబడేసరికి.

"ఆ మనిషి తను తప్పు చేస్తూ నిన్ను బెదిరిస్తాడా? ఆ బెదిరింపులకు లొంగిపోతే ఇక ఆమెను తెచ్చి నీ నెత్తిన పెట్టినా పెడతాడు. అంతేగానీ ఇలా డీలా పడిపోతే పిల్లలేమైపోతారు?" అంటూ ధైర్యం చెప్పింది.

ఆమె మాటలు విన్నాక 'జీవితం ఇంతటితో అయిపోలేదు. ఇంకా చాలానే వుంది' అనుకోగలిగింది నందిని.

మనసులో బాగోక పనిమనిషి రాకపోవడంవల్ల ఇంట్లోనే ఉండిపోయినా వారం తిరిగేసరికల్లా బోర్ ఫీలయింది నందిని. ఎనిమిదో రోజున మెల్లగా వచ్చింది పనిమనిషి రంగమ్మ.

"ఇన్ని రోజులు ఏమైపోయావ్? ఇలా చెప్పా పెట్టకుండా మానేస్తే ఎలా?" కోపంగా అడుగుతున్న నందినిని చూసి ఆశ్చర్యపోయింది రంగమ్మ.

'ఏంటీ...వంట్లో బాగాలేదా?' అంటూ ఆప్యాయంగా అడిగేది నందిని ఒక్కతేనని ఎన్నోసార్లు అనుకుంది రంగమ్మ.

"ఏం చెప్పమంటావు తల్లీ. నా కొడుకుని జైల్లో పెట్టింరు. వాడిని ఇడిపించనీకి మస్తు బాదయింది. పదిమంది కాల్లు పట్టుకున్న" అన్నది సంజాయిషీగా.

"ఏం నీ మొగుడు పట్టించుకోడా?" అంది అప్రయత్నంగా.

"సరెతియ్... ఆడే వుంటే మొగుడెందుకని వాడు నాతో ఇడిపోయి దగ్గర్నుండి పిల్లలు ఆగమయింరు. ఆడు అయిగా కులుకుతుండు. నేనే పిల్లలతో పడరాని పాట్లు పడుతున్న" అంటూ తను ఇంటా బయటా ఎదుర్కొంటున్న సమస్యలన్నీ చెప్పుకుంటూ పని ముగించింది రంగమ్మ.

ఆమె వెళ్లిపోయాక ఆలోచనలో మునిగిపోయింది నందిని పదిరోజులవుతున్నా ఇంటికి రాని జయంత్‌ను తల్చుకుంటూ. తనూ అన్ని బాధలు పడవలసి వస్తుందా? ఆ ఆలోచనకే వణికిపోయింది. జయంత్ రాకపోవడం వల్ల తను ఆర్థిక సమస్యలే గాక మరెన్నో ఎదుర్కోవాల్సి వస్తుందే! పిల్లలిప్పటికే దిగులు పడుతున్నారు.

చేతిలో డబ్బాడక ఇబ్బందిగా ఉంది. అలాగని తను జయంత్ చెప్పిందానికి తలూపాలా? ఆమెను తాకిన చేతులతో తనను తాకుతుంటే భరించి ఒళ్లప్పగించాలా? ఆ ఆలోచనే భరించలేక తల విదిలించింది. ఎలా ఎం చేయడం?


తండ్రి గురించి అడుగుతున్న పిల్లలకు ఏం చెప్పడం? జయంత్ తనూ, పిల్లలు లేకపోయినా హాయిగా ఉంటున్నప్పుడు తాను మాత్రం అతనికోసం అల్లాడిపోవడం ఎందుకు?

బాగా ఆలోచించింది. మొదట ఆర్థికంగా తను నిలదొక్కుకోగలిగితే మెల్లగా రెండో అడుగు వేయవచ్చు అనుకుంటూ నాలుగు గదుల్లో వున్న సామానంతా రెండు గదుల్లో సర్ది ఆ రెండు గదులను అద్దెకిచ్చింది. తన ఇంటి డోర్‌మీద 'ట్యూషన్స్ చెప్పబడును' అని రాయించింది. నాలుగు ట్యూషన్లు చెప్పడానికి ఒప్పుకుంది.

నగలన్నీ అమ్మి వచ్చిన డబ్బుని బ్యాంకులో వేసి నెలకి కొంత ఇంట్రెస్ట్ వచ్చేలా చేసుకుంది.


***

రెండునెలల తరువాత వచ్చిన జయంత్ జరిగిన మార్పులు చూసి వ



## బిపాషా తెలివి

'ఇండియాలో వేసవి ఎంత తీవ్రంగా వుంటుందో అందరికీ తెలుసు. అందుకే నీళ్లు, మజ్జిగ, ఫ్రూట్‌సలాడ్‌ల లాంటివి ఎక్కువగా తీసుకుంటే ఎలాంటి ఎండల్నైనా తట్టుకుని వుండగలం' అని గొప్పగా చెబుతుంది నల్లపిల్ల బిపాషా. తను నల్లగా వున్నా గ్లామరస్‌గా కనిపిస్తూ ఇట్టే ఆకట్టుకోగలగడానికీ, ఈరోజు ఈ పొజిషన్‌లోకి రావడానికీ ఎంతో తెలివిగా ప్రవర్తించడం వల్లనే- అని కూడా ఘంటాపథంగా చెబుతుంది. తన తెలివితేటలపై తనకి అంత నమ్మకం అనీ సెలవిస్తోంది.




సలోనే మండిపడ్డాడు. తను రాకుంటే కాళ్ల బేరానికి వస్తుందని ఊహిం చాడు. కానీ నందిని ధైర్యంగా తనని తను ప్రూవ్ చేసుకుంటూ నిలబడేసరికి ఖంగుతిన్నాడు. పిల్లల్ని దగ్గరకు తీసుకున్నాడు.

వాళ్లు "నాన్నా! మీరు ఇక్కడే ఉంటారా? లేక ఇంకో మమ్మీ దగ్గరకు ఎమ్మల్ని తీసుకువెళతారా?" అని అడిగేసరికి మరింత నిర్ఘాంతపో యాడు.

అంటే...నందిని వాళ్లకు అన్నీ చెప్పేసిందా? వాళ్లని మెంటల్‌గా ప్రిపేర్ చేసిందా? ప్రతి పనికీ తనమీదే ఆధారపడుతూ తను చెప్పినట్లు చేసే ఆ నందినికి ఈ నందినికి ఎంత తేడా?

ఆడవాళ్లెంత సుకుమారులో అంత కఠిన హృదయులు అన్నదాంట్లో ఇంత నిజం ఉందా? ఆలోచనలో పడిపోయాడు జయంత్. తన ఇల్లే తనకు పరాయి ఇల్లులా అన్పించింది. ఓడిపోతున్నానన్న బాధ మరింతగా కలిగేస రికి ఆమెనే ఎలాగైనా లొంగదీయాలన్న పంతంతో 'ఎన్నాళ్లని తను లేకుండా వుంటుందో తనూ చూస్తాడు. మగతోడు అవసరం తెలిసి రాకుండా వుంటుందా? ఆ పొగరు దిగివచ్చి తన కాళ్లమీద పడకుండా ఉంటుందా?' అన్న అహంకారంతో తిరిగి వెళ్లిపోయాడు.



## పాపం కంగనా

ఎంతోకాలంగా రిలీజ్ కాకుండా వుండిపోయిన 'కైట్స్' సినిమా ఎట్టకే లకు విడుదలకు సిద్ధమవుతుంటే అందులో ఒక హీరోయిన్ అయిన కంగనా రనౌత్‌ని ప్రచారయాత్రకి అస్సలు పిలవడం లేదట నిర్మాతలు. ఆ సినిమా పబ్లిసిటీలో హృతిక్‌తోపాటు మెక్సికన్ తార బార్బరాని హైలైట్ చేస్తున్నారే తప్ప కంగనా వున్న సంగతే తెలియనివ్వడంలేదు. కారణం- గతంలో ఈ సినిమా గురించిన వివరాల్ని కంగనా నోరు జారడమేనట. అమీర్ ఖాన్ 'గజిని'లో కూడా తన లూజ్ టంగ్ వల్లనే అవకాశాన్ని పోగొ ట్టుకుందిట కంగనా.




★★★

రోజులు నెలలుగా మారిపోసాగాయి. వెనుక గుసగుసలాడినా నందిని ముందు మాత్రం ఎవరూ నోరెత్తలేదు. ఆమె నైజం తెలిసినవారు ఆమెకు సపోర్టుగా నిలిచారు కూడా.

"నువ్వు ఒంటరిగా ఇన్ని బాధలు పడుతున్నావు. అతను మాత్రం హాయిగా తిరుగుతున్నాడు. నువ్వు అతనిమీద కేసు పెట్టవచ్చు నీకు సవితి పోరును తెచ్చినందుకు, దాంపత్య సుఖం లేకుండా చేస్తున్నందుకు" అంటూ అంజలి జయంత్‌ను తిడుతుంటే-

"అతను ఒక విధంగా నాకు మేలే చేసాడులే. ఒంటరి పోరాటంలోని థ్రిల్ అర్థమయ్యేలా చేస్తున్నాడు. నాలో నాకే తెలియకుండా నిద్రపోయి ఉన్న శక్తిని మేలుకొలిపేలా చేసాడు" అని నందిని జవాబిస్తే ఆశ్చర్యపోవడం అంజలి వంతయింది.

డిపార్ట్‌మెంట్ ఎగ్జామ్స్‌కి ప్రిపేరవుతూ తన కెరియర్‌పట్ల జాగ్రత్తలు తీసు కోసాగింది నందిని.

ఫలితంగా పరీక్షల్లో విజయం సాధించి ప్రమోషన్ కూడా పొందగలి గింది. ఆర్థికంగా కూడా నిలదొక్కుకోగలిగింది.

మగపిల్లలిద్దరూ తల్లిని బాగా అర్థం చేసుకున్నవాళ్లవడంవల్లా, స్వత హాగా తెలివితేటలున్నవాళ్లు అవడంవల్లా తొందరగా చదువులు ముగించి కంప్యూటర్ కోర్సులు చేసి మల్టీనేషనల్ కంపెనీల్లో చేరారు. చేరిన రెండేళ్లకే తనని మించి సంపాదిస్తున్న కొడుకులను చూసి నందినికి ఆనందోద్వేగాల తోపాటు కించిత్తు గర్వం కూడా కలిగేది. అయినా దాన్నంతా ఎక్స్‌ప్రెస్ చేయకుండా మనిషన్నాక కష్టాల్లో, సుఖాల్లో ఎలా మెలగాలో ఎప్పటిక ప్పుడు చెబుతుండేది.

వాళ్ల పుట్టినరోజునాడు లేనిపోని ఆర్భాటాలు చేయకుండా అనాథాశ్ర మాల్లో వారికి, వృద్ధాశ్రమాల్లోని వారికి పళ్లు, బట్టలు పంచమనేది. వాళ్లూ ఆ పనిలో తృప్తిని పొందేవాళ్లు.

"అమ్మా! నువ్వింకా ఎందుకు కష్టపడడం? వాలంటరీ రిటైర్‌మెంట్ తీసు కోమ్మా" అని పిల్లలు బతిమాలినా-

"నా వంట్లో శక్తి ఉన్నంతవరకు నేనెవరిమీదా ఆధారపడదల్చుకోలే దురా" స్వంత సంపాదన మనిషికెంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందో రుచి చూసిన మనిషి కనుక.

★★★

రోజులు చకచకా గడిచిపోతున్నాయి.

"అమ్మా! నా ఫ్రెండ్ రవి వాళ్లమ్మగారిని హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తే చూడ్డానికి వెళ్లానమ్మా. అక్కడ పక్కరూమ్‌లో అడ్మిట్ అయిన ఆవిడ డాక్ట ర్‌గారికి తన భర్త పేరు జయంత్ అనీ, మనింటి పేరునీ చెప్పడమే కాకుండా

ఆయన చేస్తున్న బిజినెస్ గురించి చెప్పారు. ఇంకా..." అంటూ ఆగిపోయాడు ప్రణీత్.

"ఊ...చెప్పు ఫర్వాలేదు" అంది నందిని.

"ఆమె తనకీ భర్తకీ పడక వేరు అయిపోయామని, అతడు వట్టి అవకాశవాది అని ఇంకా నానా దుర్భాషలు ఆడింది. ఆమెనీ ఆమె కూతుర్నీ నట్టేట ముంచిపోయాడని బాధపడింది. పాపం ఆవిడకేమో కాన్సరట. 'నాకేమైనా ఫర్వాలేదు. లేకలేక పుట్టిన ఆడపిల్ల దిక్కులేనిదయిపోతుందని వాపోయింది. ఆ పిల్లకిప్పుడు పధ్నాలుగేళ్లు ఉండవచ్చు. అమాయకంగా, అర్భకంగా ఉందమ్మా" అన్నాడు ప్రణీత్.

తనకీ నవ్యకీ పిల్లలు పుట్టరని చెప్పాడే జయంత్! మరి ఈ పాపెవరు? బహుశా నవ్య ప్రాబ్లం సాల్వ్ అయ్యాక పుట్టిన బిడ్డ కావచ్చు. ఆడపిల్లలంటేనే ఖర్చు అని భయపడే జయంత్ అలా ప్రవర్తించడంలో వింతేముంది? అనుకుంటూ "పదరా! మనం హాస్పిటల్‌కు వెళ్లి ఆవిడ్ని చూసి వద్దాం" అంది ఓ నిర్ణయంతో.

★★★

"అక్కా! మిమ్మల్ని క్షమించమని అడగడానికి నాకు నోరు రావడంలేదు. పచ్చని మీ సంసారంలో చిచ్చుపెట్టిన నన్ను మంచి హాస్పిటల్‌లో చేర్పించి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. నా పాపని కన్నబిడ్డలా ఆదరిస్తున్నారు. ఇక వినీత్, ప్రణీత్‌లు తమ స్వంత చెల్లెలికన్నా ఎక్కువగా పాపని పట్టించుకుంటున్నారు. నా దగ్గరున్నదంతా లాక్కుని నన్నీ స్థితికి తెచ్చిన జయంత్‌కీ, వీరికి ఎంత తేడా? నీ పెంపకంలో వాళ్లు ఇలా ఆణిముత్యాల్లా తయారయ్యారు. నన్ను క్షమించి ఆదరించకపోతే నేనీపాటికి పైలోకానికి, నా పాప ఏ విటులపాలో అయి ఉండేది. ఆనాడు నిన్ను వదిలి జయంత్ వస్తే అది నా అందం చూసి అని, నా సామర్థ్యం అనీ మురిసిపోయాను. నీ పిల్లలకు కన్నతండ్రి ప్రేమ దక్కకుండా చేసాను. అయినా అవన్నీ మర్చిపోయి ఎలా మన్నించగలుగుతున్నావక్కా?" అంది నవ్య తనని చూడడానికి వచ్చిన నందినితో.


"మనుష్యుల కష్టసుఖాలను అర్థం చేసుకునేంతగా నన్ను తయారుచేసాడు జయంత్. నన్ను వదిలి వచ్చిన ఆయన వైఖరి నువ్వప్పుడే అంచనా వేస్తే ఇలా మిగిలిపోయేదానివికాదు. పోనీలే గతం గతః. మనిద్దరం వంచితులమే. పిల్లలను ఈ భూమిమీదకు తెచ్చినందుకు వారిని సవ్యంగా తీర్చిదిద్దడం మన బాధ్యత. ఆ బాధ్యత నెరవేరుస్తూ మనకున్నదాంట్లోనే కొంత మన లాంటి అభాగ్యులకు వెచ్చించడం, తోచిన సాయం చేయడం చేస్తే మన జీవితాలకో సార్థకత లభిస్తుందని నా నమ్మకం. నా అదృష్టంకొద్దీ నా పిల్లలు నన్ను అర్థం చేసుకుని వారి వారి సహకారాన్ని అందిస్తున్నారు. నేను ఇంతవరకూ కూడబెట్టిన డబ్బుతో ఓ ఆశ్రమంలాంటిది నెలకొల్పి అందులో మనలా మోసపోయిన వారికి ఆశ్రయమిచ్చి కౌన్సిలింగ్ చేయించి వాళ్లు వాళ్ల కాళ్లమీద బతికేలా ఏర్పాటు చేయాలన్నది నా కోరిక. దీనికి కొంత విరాళాలు సేకరించాలి. పెద్దల సహకారం కోసం తిరగవలసి వుంటుంది. అవన్నీ చేయాలంటే మరికొందరి సహాయం అవసరమవుతుంది" అంటూ ఆగింది నందిని.

"అక్కా! నా ఫ్రెండ్ సర్కిల్ చాలా పెద్దది. నువ్వూ నేనూ కలిస్తే నీ కల సాకారం అవుతుంది. నాకు పునర్జన్మ ఇచ్చిన నీ ఋణం ఇలా తీర్చుకుంటాను. నాకిప్పుడు పాప గురించిన చింతేమీ లేదు. దాని అన్నలు దాని భవిష్యత్తును తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఉంది. కాబట్టి మనిద్దరం ఈ రోజు నుండీ ఆశ్రమ స్థాపనకు కృషి చేద్దాం" అంది నవ్య.

ఆమె మాటల్లో తొణికిసలాడుతున్న ఆత్మవిశ్వాసం చూసి తననుకున్నది సాధించగలనన్న నమ్మకం బలపడింది నందినికి. మానవతకున్న బలం ఇంతా అంతా కాదుగా!

వారిద్దరి మాటలు వింటున్న ప్రణీత్, వినీత్‌లు చప్పట్లు కొడుతూ "మీ ఇద్దరికీ మా పూర్తి సహకారాన్ని అందిస్తాం. మా ఫ్రెండ్స్ ద్వారా కూడా సహకారం అందేలా చేస్తాం" అన్నారు పూర్తి భరోసా ఇస్తూ.

★



## ప్రపంచంలో అతి పెద్ద కుక్క

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన కుక్కగా గిన్నెస్ బుక్‌లోకి ఎక్కింది అరిజోనాకి చెందిన జార్జి అనే ఈ కుక్క. పాదం నుంచి భుజం దాకా దాని ఎత్తు 3 అడుగుల 7 అంగుళాలు. బరువు 123 కిలోలు. జార్జి యజమానులు డేవిడ్, క్రిస్టన్‌లు దీని 7 వారాల వయస్సు నుంచీ పెంచుకుంటున్నారు. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించి ట్విట్టర్, ఫేస్‌బుక్స్‌లో దీని పేరున సందేశాలు పంపుతుంటారు.

-తటవర్తి

